క్లుప్తంగా

ఘనంగా అన్న సమారాధన



అన్న ప్రసాదం వడ్డిస్తున్న రమణ తదితరులు

పెదగంట్యాడ : జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని వాంబేకాలనీలోని వేంకటేశ్వరస్వామి వారి ఆలయ సన్నిధిలో శనివారం అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వరాహ లక్ష్మీనరసింహస్వామి ట్రస్ట్ బోర్డు మెంబర్ దొడ్డి రమణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మంజుల, పెంటకోట పైడిరాజు, రామారావు, నరసింగరావు, సత్యవతి, సావిత్రి, లక్ష్మి, నాగమణి, పద్మ, కవితపాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



వార్షికోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కూర్మన్నపాలెం : జీవీఎంసీ 87వ వార్డు పరిధి శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి 23వ ఆలయ వార్షికోత్సవాన్ని ఈ నెల 31వ తేదీ నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు నిర్వహించనున్నామని ఆలయ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ మేరకు ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల అందజేత



వీల్ చైర్‌లో దివ్యాంగురాలు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పెదమడకకు చెందిన సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ సారధ్యంలో మూడు చక్రాల సైకిళ్లను అందించింది. విజయనగరానికి చెందిన రేవతి అనే దివ్యాంగురాలికి మూడు చక్రాల సైకిల్ కావాలని ఆమె బంధువులు ట్రస్ట్ ప్రతినిధులను సంప్రదించడంతో స్పందించిన ట్రస్ట్ రేవతితో పాటు మరో నలుగురికి మూడు చక్రాల సైకిళ్లను అందించింది. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అల్బెండజోల్ మాత్రల సరఫరా



అంగన్‌వాడీ టీచర్లకు అల్బెండజోల్ మాత్రలు సరఫరా చేస్తున్న జీవన్ జ్యోతి

కూర్మన్నపాలెం : నేషనల్ డివార్మింగ్ డే సందర్భంగా గాజువాక జీవీఎంసీ కార్యాలయంలో కణితి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంపీహెచ్ఈఓ బాబీ ఆధ్వర్యంలో పలువురు ప్రభుత్వ, ప్రైవేట్, అంగన్‌వాడీ స్కూల్స్ టీచర్లకు అల్బెండజోల్ మాత్రలు సరఫరా చేశారు. ఈ కార్యక్రమానికి ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ జీవన్ జ్యోతి విచ్చేసి సరఫరా జరిగే తీరును పరిశీలించారు. ఈ నెల 14వ తేదీ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని 5 ఏళ్లలోపు చిన్నపిల్లలకు అల్బెండజోల్ మాత్రలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు మంగ, కమలకుమారి తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం



వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న నాయుడు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని నడుపూరు గ్రామ దేవత పైడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవాలను పురస్కరించుకుని చెల్లుబోయిన నాయుడు, తాటికొండ కాశీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను శనివారం ప్రారంభించారు. ఆలయ ప్రాంగణంలో రెండు రోజుల పాటు ఈ పోటీలను నిర్వహించనున్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించనున్న ఈ పోటీల్లో మొత్తం 25 జట్లు పాల్గొనున్నాయి. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి కింద రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.8వేలు, తృతీయ బహుమతి రూ.6 వేలు, నాలుగో బహుమతి కింద రూ.4వేలతో పాటు షీల్డ్‌లను ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో పితాని భాస్కరరావు, తాటికొండ సుదర్శన్, బత్తిన నాగభూషణం, బత్తిన భానుకిరణ్, ఇందల సంతోష్, పూడి సన్నీ, మేడిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్..
టార్గెట్ ఫస్ట్ ర్యాంక్

- ప్రజారోగ్య సిబ్బందిని సిద్ధం చేసిన జీవీఎంసీ
- పొరపాట్లు సరిదిద్దుకుంటూ ముందడుగు...

గాజువాక : స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఈ ఏడాది మొదటి ర్యాంకు సాధించడంపై జీవీఎంసీ దృష్టి సారించింది. దీనికోసం గాజువాక జోన్‌లో పారిశుధ్య నిర్వహణను అత్యంత సమర్థవంతంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రజారోగ్య సిబ్బందికి ఉన్నతాధికారులు దిశానిర్దేశం కూడా చేశారు. ఏయే పారామీటర్లలో వృద్ధి సాధించాలి, నిర్వహణలో పర్యవేక్షణ ఎలా ఉండాలి వంటి అంశాలను ఇప్పటికే శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, అవుట్ సోర్సింగ్ సూపర్ వైజర్లకు తెలియజేశారు. గత ఏడాది జరిగిన పొరపాట్లను సరిదిద్దుకొంటూ ఈ ఏడాది మొదటి ర్యాంకు సాధించే విధంగా కార్యాచరణను అమల్లోకి తెస్తున్నారు.

ఈ లక్ష్య సాధనలో భాగంగా గాజువాక జోన్‌లో టిప్పర్ల సంఖ్యను పెంచాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఐదు టిప్పర్లున్న గాజువాకలో మరో పది టిప్పర్లను అదనంగా ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించారు. కార్మికుల కొరతను కూడా అధిగమించే విధంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గాజువాక జోన్‌లో విలీన ప్రాంతాలు కూడా అధికంగా ఉన్న విషయం తెలిసిందే. పెద్ద ప్రాంతం కావడంతో ఇక్కడ 20 వార్డులు ఏర్పాటయ్యాయి. ఈ ప్రాంతాల్లో కూడా పారిశుధ్య నిర్వహణను మరింత సమర్థంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. దీనికోసం 50 మంది ప్రైవేటు సిబ్బందిని నియమిస్తున్నారు. డెబ్రిస్ అధికంగా ఉత్పన్నమయ్యే హౌసింగ్ బోర్డు వంటి కాలనీలపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని నిర్ణయించారు. విలీన కాలనీల్లో కలుపుకొని డెబ్రిస్ అధికంగా వస్తున్న ప్రాంతాల్లో ప్రత్యేక శానిటరీ టీములను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు చేశారు. ఈ పనులను సమర్థంగా నిర్వహించేందుకు కార్మికులకు అవసరమైన పనిముట్లను పూర్తిస్థాయిలో సమకూర్చుతున్నారు. ఇప్పటికే చీపుర్లు, గౌజ్‌లు, చవాకులు వంటి పనిముట్లను అదనంగా రప్పించారు.

కొండ ప్రాంతాల్లో చెత్తను రోడ్లపై పడేయకుండా చర్యలు తీసుకొంటున్నారు. దీనికోసం 200 వీల్ బేరోలు కావాలని ప్రతిపాదనలు చేసినట్టు ప్రజారోగ్య విభాగవర్గాలు తెలిపాయి. వాటితోపాటు 90 కాంపాక్ట్ బిన్‌లకు కూడా ఉన్నతాధికారుల ఆమోదం లభించినట్టు చెబుతున్నారు. పోర్టు రోడ్‌లోని గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌కు వస్తున్న చెత్తను ఏరోజుది ఆరోజే తరలిస్తున్నారు. గాజువాకలో ప్రస్తుతం 220 టన్నుల చెత్త ఉత్పన్నమవుతోంది.



జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయం

క్లాప్ వాహనాలద్వారా దాన్ని ఎప్పటికప్పుడు ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌కు తరలిస్తున్న విషయం తెలిసిందే. ఆ చెత్తను అక్కడినుంచి అదేరోజు డంపింగ్ యార్డుకు పంపించేస్తున్నట్టు అధికారులు తెలిపారు

అందరూ సహకరించాలి



స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మొదటి ర్యాంకు సాధించడం కోసం ప్రజలు కూడా సహకరించాలి. దేశంలో గల 4250 పట్టణాలకు గాను గత ఏడాది మన జీవీఎంసీ మొదటి ర్యాంకు సాధించింది. అందుకే ఈ ఏడాది మొదటి ర్యాంకు లక్ష్యంగా సాగుతున్నాం. దీనికోసం శక్తివంచన లేకుండా కష్టపడాలని మా సిబ్బందికి కూడా చెప్పాం. పారిశుధ్య నిర్వహణకు అవసరమైన అన్ని అవసరాలను కమిషనర్ ఆమోదించారు.

– డాక్టర్ కిరణ్ కుమార్, ప్రజారోగ్య అధికారి,

షిర్డీ సాయి శాంతి ధామం వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు

పెదగంట్యాడ: మండలంలోని సమతానగర్‌లోని షిర్డీసాయి శాంతి ధామం 9వ వార్షికోత్సవాలు ఆదివారంతో ముగియనున్నాయి. ఇందులో భాగంగా ఉదయం 5 గంటలకు కాకడ హారతి, 6 గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, చక్కెరాభిషేకం భక్తుల స్వహస్తాలతో చేయనున్నామని ఆలయ కమిటీ చైర్మన్ బండి శ్రీనివాసరావు చెప్పారు. 10.30 గంటలకు మహా కుంభాభిషేకం, మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్న సమారాధన కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా కోలాటం తదితర సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి పరస ఉంటుందని, సాయంత్రం సంధ్యాహారతి, పుష్పయాగం, ఊంజల్ సేవతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

మహిళలకు సముచిత స్థానం



చీరలు పంపిణీ చేస్తున్న సేవా సంఘం సభ్యులు

అగనంపూడి: ప్రభుత్వాలు మహిళలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం, గౌరవం దక్కేలా అవకాశాలు కల్పిస్తున్నాయని అగనంపూడి ఆయుష్ వైద్యాధికారి సుమన్ లలితా దేవి అన్నారు. అగనంపూడికి చెందిన శ్రీపద్మ మార్కండేయ సేవా సంఘం సారధ్యంలో శనివారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ సెల్ అధికారి డేవిడ్ రాజు, పద్మ మార్కండేయ సేవా సంఘం అధ్యక్షురాలు పచ్చారి ప్రభావతి, సీడబ్ల్యూసీ వైస్ ప్రెసిడెంట్ గుదే గజేంద్రరావు, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, ధర్మాల సుబ్బారావు, గుదే వరలక్ష్మి, నెల్లి వెంకటరమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



అక్కిరెడ్డిపాలెం జెడ్పీ స్కూల్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల ప్రత్యేక అధికారి వీరభద్రరావు

అక్కిరెడ్డిపాలెం: ఈ నెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ జరిగే పాఠశాలలను అధికారులు పరిశీలించారు. శనివారం ఎన్నికల ప్రత్యేక అధికారి వీరభద్రారావు గాజువాక డిప్యూటీ తహసీల్దార్, ఎస్ఏసీ త్రినాథ్, రెవెన్యూ సిబ్బందితో కలిసి 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పరిస్థితిని సమీక్షించారు. పోలింగ్ జరిగే పాఠశాల ఆవరణ, తరగతి గదులు, పరిసరాలు పరిశీలించారు. పాఠశాల పరిసరాల్లో ప్రైవేట్ వ్యక్తులు చేస్తున్న పనులను సాయంత్రంతో ముగించాలని రేపటి నుంచి పనులు చేపట్టవద్దని కార్మికులకు హెచ్చరించారు. కార్యక్రమంలో గాజువాక రెవెన్యూ ఆర్ఐ విజయ, సర్వేయర్ రామారావు, వీఆర్వో ఆనంద్, సచివాలయాల ఆర్ఐలు, ఇతర వెవెన్యూ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా క్రైస్తవ ఆత్మీయ సమ్మేళనం



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక : గాజువాకలో క్రైస్తవ ఆత్మీయ సమ్మేళనం శనివారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం అధ్యక్షుడు అద్దేపల్లి రవిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతు ప్రకటించారు. తొలుత బిషప్ ఆనంద్ దైవ సందేశాన్ని ఇచ్చిన అనంతరం వక్తలు ప్రసంగించారు. రాష్ట్ర ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌ను ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీ మాట్లాడుతూ విశాఖను పరిపాలనా రాజధానిగా ప్రకటించిన ముఖ్యమంత్రికి సుధాకర్‌కు గెలిపించి బహుమతిగా ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి, జాన్‌వెస్లీలను రవిబాబు ఘనంగా సత్కరించారు. తనకు వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా పదవి ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, ఉరుకూటి చందు, రాజాన రామారావు, ఎస్సీ, ఎస్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మార్టుపూడి వరదేశి, క్రైస్తవ సంఘాల నాయకులు, పాస్టర్‌లు ఆలివర్ రాయి, బిల్లీగ్రహం, బిషప్ ధనరాజ్, అనిల్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

పెదగంట్యాడ: ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) పథకంలో భాగంగా జిల్లాలోని 15 ఏళ్ల నుంచి 45 ఏళ్ల నిరుద్యోగ యువతకు వివిధ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నామని ప్రభుత్వ ఐటీఐ స్టీల్‌సిటీ ప్రిన్సిపాల్ లండా సుధాకరరావు బుధవారం తెలిపారు. ఫిట్టర్, ఫ్యాబ్రికేషన్, టిగ్ వెల్డింగ్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, సీఎన్‌సీ టర్నింగ్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ప్లంబర్ జనరల్ అండ్ లైట్ మోటర్ వెహికల్ డ్రైవింగ్ (ఎల్ఎంవీ) తదితర కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నామని వివరించారు. ఈ శిక్షణకు పదో తరగతి పాస్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన వారు అర్హులన్నారు. డ్రైవింగ్ శిక్షణకు 18 ఏళ్లు నిండి ఉండాలని, ఐదో తరగతి నుంచి పదో తరగతి పాసైన, ఫెయిలైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అభ్యర్థుల సౌలభ్యం కోసం తమ కార్యాలయంలో ఉచితంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్ జెరాక్స్, ఫోన్ నెంబర్, ఈ-మెయిల్ ఐడీతో తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల ముఖాముఖి నేడు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆడారి కిషోర్‌కుమార్

సీతంపేట: ఈ నెల 13న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం ఉదయం 9.30 గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఎమ్మెల్సీ అభ్యర్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఉత్తరాంధ్ర విద్యావంతుల వేదిక కన్వీనర్ ఆడారి కిషోర్‌కుమార్ తెలిపారు. పబ్లిక్ లైబ్రరీలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సహాయత వెల్ఫేర్ సొసైటీతో కలిసి మొదటి సారిగా ఎన్నికల బరిలో పోటీపడుతున్న అభ్యర్థులతో ఓపెన్ డిబేట్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధాన రాజకీయ పార్టీలు మద్దతు ఇస్తున్న అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్న సుమారు 38 మంది పాల్గొంటారని వెల్లడించారు. వారంతా తమ మ్యానిఫెస్టోను వివరిస్తూ ఈ చర్చా వేదికపై నుంచి కార్యాచరణ వివరిస్తారన్నారు. ముందుగా కార్యక్రమ కరపత్రాలు ఆవిష్కరించారు. సమావేశంలో జ్ఞానానంద, వెంకటేష్, శ్రీధర్, వంశీ, అసిత పాల్గొన్నారు.

సీఐఎస్ఎఫ్ జవానుకు కన్నీటి వీడ్కోలు



తండ్రికి కొరివి పెడుతున్న పెద్ద కుమార్తె శ్వేత

ఉయ్యూరు: సీఐఎస్ఎఫ్ జవానుకు కన్నీటి వీడ్కోలు పలికారు. ఉయ్యూరుకు చెందిన చింతా రమేష్‌బాబు (53) విశాఖపట్నం వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో సీఐఎస్ఎఫ్ జవానుగా పనిచేస్తున్నారు. గుండెపోటుతో గురువారం కన్నుమూశారు. భౌతికకాయాన్ని శుక్రవారం రాత్రి స్వగ్రామమైన ఉయ్యూరుకు తరలించారు. శనివారం రమేష్‌బాబు భౌతికకాయానికి అధికార లాంఛనాలతో సీఐఎస్ఎఫ్ జవానులు అంత్యక్రియలు జరిపించారు. జవాను రమేష్‌బాబుకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె శ్వేత, చిన్న కుమార్తె కీర్తి తండ్రికి అన్నీ తామై అంత్యక్రియలు నిర్వహించి కన్నీటి పర్యంతం అయ్యారు. హిందూ శ్మశానవాటికలో పెద్ద కుమార్తె శ్వేత తండ్రి భౌతిక కాయానికి తలకొరివి పెట్టి రుణం తీర్చుకుంది.

ఏప్రిల్ 9న హెచ్‌ఆర్‌సీ సర్వసభ్య సమావేశం

డాబాగార్డెన్స్: ఏప్రిల్ 9న డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మానవ హక్కుల కౌన్సిల్(హెచ్ఆర్‌సీ) సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని కౌన్సిల్ కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్లో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో భాగంగా మానవ హక్కుల పరిరక్షణలో పౌరుడి పాత్ర అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్న వారిని ఆహ్వానించి వారి సూచనలు, సలహాలు స్వీకరిస్తామన్నారు. సర్వసభ్య సమావేశానికి హైకోర్టు న్యాయమూర్తులను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర స్థాయి కమిటీ ఏర్పాటుతో పాటు రాష్ట్ర గవర్నర్‌గా నియమితుడైన జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు మానవ హక్కుల పటిష్టతకు చేపట్టాల్సిన చర్యపై నివేదిక అందజేయనున్నట్టు పేర్కొన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణను నిలిపివేయాలి



758వ రోజు ఉక్కు దీక్షలో పాల్గొన్న కాంట్రాక్ట్ కార్మికులు

కూర్మన్నపాలెం : ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ కోసం నిరంతరం కార్మికులు చేస్తున్న పోరాటానికి కేంద్ర ప్రభుత్వం సమాధానమివ్వాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 758వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన ఎం.ఎస్.ఎస్-2 విభాగానికి చెందిన కార్మికులు పాల్గొన్నారు. కార్మికులు చేస్తున్న పోరాటానికి విలువనిచ్చి కేంద్ర ప్రభుత్వం ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలన్నారు.

జంతు మృత కళేబరాల తొలగింపు



గెడ్డల్లోని జంతు మృత కళేబరాలను తీయిస్తున్న ఏఎంఓహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్

సాక్షి ఎఫెక్ట్..

పెదగంట్యాడ: బీసీ రోడ్డులో రహదారికి ఇరువైపులా ఉన్న తుప్పల్లో, గెడ్డల్లో ఉన్న జంతువుల మృత కళేబరాలను శనివారం తొలగించారు. వాటిని అక్కడి నుంచి తొలగించి మట్టిలో పూడ్చి వేశారు. స్టీల్‌ప్లాంట్ బీసీ గేటుకు వెళ్లే ప్రధాన రహదారి వంతెన పక్కన ఆనుకొని ఉన్న గెడ్డలతో పాటు తుప్పల్లో కుక్కలు, పందుల మృత కళేబరాలు దర్శనమివ్వడంతో ఉక్కు ఉద్యోగులతో పాటు అటుగా రాకపోకలు సాగించే వారు అవస్థలు పడేవారు. గత 15 రోజులుగా ఇక్కడ పరిస్థితి నెలకొని ఉన్న నేపథ్యంలో ఈ నెల 11న 'కలవరపెడుతున్న జంతు మృత కళేబరాలు' శీర్షికను 'సాక్షి' దిన పత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో ఏఎంఓహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్ స్పందించారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న మృత కళేబరాలతో పాటు పూడికను తొలగించి గెడ్డలను శుభ్రం చేయించారు.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

డాబాగార్డెన్స్: ఉగాది విశిష్ట ప్రతిభారత్న-2023 పురస్కారాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సర్వేజనా సుఖినో భవంతు సామాజిక, సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాస్టారు తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పల్లెలు, పట్టణాల్లో ఉన్న కవులు, కళాకారులు, రచయితలు, విద్యావంతులు, ఉపాధ్యాయులు, మేధావులు, వైద్యులు, సమాజ సేవకులు, ఆధ్యాత్మిక, యోగా గురువులు, కార్మికులు, కర్షకులు, క్రీడాకారుల ప్రతిభను గుర్తించి ఈ నెల 26న హైదరాబాద్‌లో ఘనంగా సత్కరించనున్నట్టు పేర్కొన్నారు. వివరాలకు 96523 47207 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

ముగిసిన ప్రచార పర్వం

- ఓటర్లను అభ్యర్థించిన ప్రధాన పార్టీలు
- సీతంరాజును గెలిపించాలని వైఎస్సార్‌సీపీ విస్తృత ప్రచారం

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రంతో ముగిసింది. అన్ని ప్రధాన పార్టీలు తమ అభ్యర్థుల గెలుపు కోసం విస్తృత ప్రచారం నిర్వహించాయి. వైఎస్సార్‌సీపీ నేతలంతా సమష్టిగా ప్రచారం నిర్వహించారు. పలు సామాజిక వర్గాలతో సమావేశమై తమ పార్టీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే టీడీపీ, పీడీఎఫ్, బీజేపీ, స్వతంత్ర అభ్యర్థులు కూడా ప్రచారం నిర్వహించారు.



పెదగంట్యాడ పీహెచ్‌సీలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



ప్రచారంలో పాల్గొన్న బీజేపీ నాయకులు



భెల్ ఇన్‌చార్జ్ జీఎంకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



ప్రచారంలో పాల్గొన్న పీడీఎఫ్ నాయకులు

అక్కిరెడ్డిపాలెం : గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి..వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి భెల్ (హెచ్‌పీవీపీ)లో కార్మిక ఉద్యోగులను కలిశారు. పార్టీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. సంస్థ ప్రధాన గేటు వద్ద కార్మికులకు కరపత్రాలను అందజేశారు. వరుస సంఖ్య 3లో ఉన్న సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటును వేయాలని కోరారు. భెల్ జీఎం (ఇన్‌ఛార్జ్) ఎస్.జితేందర్ రెడ్డికి ఎమ్మెల్యే నాగిరెడ్డి కరపత్రాన్ని అందజేశారు. ఓటు వేసే సమయంలో ఉద్యోగులకు, కార్మికులకు వెసులుబాటు కల్పించాలని కోరారు. వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి, గాజువాక నియోజక వర్గం ఇన్‌చార్జ్ తిప్పల దేవన్ రెడ్డి, నాయకులు మంత్రి రాజశేఖర్, వై.మస్తానప్ప, సంస్థ యూనియన్ నాయకులు ఉరుకూటి బాబూరావు, వి.ఆనందరావు, కొల్లి దేముడు, ఈగలపాటి యువశ్రీ, టి.ఎల్.నర్సింగరావు, సుభాని, ఆర్.అప్పారావు, నర్సింహులు, ఆనంద్ కుమార్, కాకి అప్పల రెడ్డి, బోగాది అప్పారావు, ఆకుల ఉపమాక, అక్కిరెడ్డి వెంకట్రావు, సిరట్ల శ్రీనివాస్, ధర్మాల శ్రీను, విరోతి గణేష్, మద్దాల అప్పారావు తదితరులు, మళ్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థికి మద్దతుగా..

అగనంపూడి: వైఎస్సార్‌సీపీ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని 79వ వార్డు పార్టీ ఇన్‌చార్జ్ అప్పికొండ మహాలక్ష్మినాయుడు, మండల కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో మామిడి శ్రీను, సోమునాయుడు, జె.సమర తదితరులు పాల్గొన్నారు.

పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.రమాప్రభను గెలిపించాలని లంకెలపాలెం, అగనంపూడి, దువ్వాడ సెక్టార్-1ల్లో జనవిజ్ఞాన వేదిక, వామపక్షాల నాయకులు ప్రచారం చేపట్టారు.

ముమ్మర ప్రచారం

కూర్మన్నపాలెం : జీవీఎంసీ 87వ వార్డులో వైఎస్సార్ సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా 87వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇంచార్జ్ కోమటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రచారాన్ని నిర్వహించారు. వార్డు పరిధిలోని కళింగవీధి సచివాలయం పరిధిలోని గవరవీధి, బొట్టవానిపాలెం తదితర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లను కలిసి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యతను ఇచ్చి అధిక సంఖ్యలో ఓటు వేయాలని కోరుతూ కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కోమటి రమాదేవి, కాండ్రేగుల కనకలక్ష్మి, కరణం లక్ష్మి, బ్రాహ్మణి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

87వ వార్డులో..

జీవీఎంసీ 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రగడ వేణుబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వార్డులోని కణితి గాంధీ బొమ్మ మెయిన్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఓటర్లను కలిసి సీతంరాజు సుధాకర్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు.

కరపత్రాల పంపిణీ

కూర్మన్నపాలెం: వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుల బొడ్డ గోవింద్ ఆధ్వర్యంలో ప్రచారాన్ని నిర్వహించారు. వార్డులోని తిరుమలనగర్‌లో ఇంటింటికి తిరుగుతూ పట్టభద్రులైన ఓటర్లను కలిసి ఓటు వేయాలని కోరుతూ కరప్రతాలను అందించారు.

వాడవాడలా ప్రచారం

పెదగంట్యాడ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపర్చిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కోరారు. ఈ మేరకు పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పలు పాఠశాలల్లో శనివారం ప్రచారం చేశారు. సీతంరాజు సుధాకర్‌కు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, మార్టుపూడి పరదేశి, 75వ వార్డు అధ్యక్షుడు గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, రాజాన వెంకటరావు, వెంకటేష్, రాము, గోవింద్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

76వ వార్డు పెదకోరాడలో..

వైఎస్సార్ సీపీ 76వ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ ఆధ్వర్యంలో వార్డు పరిధిలోని సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరంకుశం ప్రమీల, నరసింహమూర్తి, కాకినాడ పెంటారావు, ములకలపల్లి ప్రసాద్, కె.మురళి, బాలాజీ, లక్ష్మీ, దేవి పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థిని గెలిపించాలని..

పీడీఎఫ్ బలపర్చిన అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని జిప్సా మాజీ అధ్యక్షుడు ఎస్‌వీకే పరశురామ్, జన విజ్ఞాన వేదిక పెదగంట్యాడ జోన్ కార్యదర్శి ఎం.సింహాచలం కోరారు. ఈ మేరకు మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి ప్రచారం చేశారు.

ప్రైవేటు పాఠశాలల్లో ప్రచారం

గాజువాక : ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీగా కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ పీడీఎఫ్ నాయకులు శనివారం గాజువాకలో ప్రచారం చేశారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌వీకే పరశురామ్ ఆధ్వర్యంలో వివిధ ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులను కలిసి రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు డి.లక్ష్మణరావు, రమణ, ఎం.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

అలాగే 72వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం విస్తృత ప్రచారం చేశారు. వార్డు వైఎస్సార్‌సీపీ సిరట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి ప్రచారం నిర్వహించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిని పూర్తిస్థాయిలో సాధించేందుకు సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కుమార్‌సాయి, మధుసూదన్ రెడ్డి, భవాని, సంతోష్, పరీదుల శ్రీనివాస్, దీప్తి, మధు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ప్రచారం

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పీవీఎన్ మాధవ్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరుతూ ఆ పార్టీ గాజువాక నాయకులు శనివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. పార్టీ గాజువాక కో ఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని వివిధ కాలనీల్లో గ్రాడ్యుయేట్లను కలుసుకొని మాధవ్‌ను గెలిపించాలని కోరారు.